

ఖో ఖో పోటీల్లో గెలుపొందిన క్రీడాకారులతో కార్పొరేటర్ రచనశ్రీ తదితరులు

విద్యార్థులు క్రీడల్లోనూ రాణించాలి

కవాడిగూడ, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించి దేశానికి, రాష్ట్రానికి పేరు ప్రతిష్టలు తీసుకురావాలని కవాడిగూడ కార్పొరేటర్ జి రచనశ్రీ క్రీడాకారులకు సూచించారు. సోమవారం దోమలగూడ గగన్‌మహల్‌లోని ప్రభుత్వ వ్యాయామ కళాశాలలో విద్యార్థులకు జరిగిన ఖో ఖో పోటీలకు ఆమె ముఖ్య అతిథిగా హాజరైయ్యారు. ఈ సందర్భంగా రాష్ట్ర వ్యాప్తంగా పది జిల్లాల నుంచి దాదాపు 200 మందికిపైగా ఖో ఖో క్రీడాకారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. విద్యార్థులను చదువుతో పాటు క్రీడల్లో రాణించేందుకు తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు సహకరించాలన్నారు. ఈ సందర్భంగా ఖో ఖో పోటీల్లో విజేతలైన వారిని అభినందించారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర నాయకులు జి.వెంకటేష్, ప్రభుత్వ వ్యాయామ కళాశాల ఉపాధ్యాయులు, క్రీడకారులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

చిక్కడపల్లి, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): ఆజామాబాద్ డివిజన్, హైదరాబాద్ సిటీ-1 పరిధిలో మంగళవారం విద్యుత్ సరఫరా ఉండదని ఏడీఈలు జి.నాగేశ్వరరావు, వినోద్‌కుమార్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. గోల్కొండక్రాస్‌రోడ్ పరిధిలోని ఏక్‌మినార్ మసీదు, కృష్ణాకాలనీ తదితర ప్రాంతాల్లో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు, స్పెన్సర్ పరిధిలోని శివాలయం, రాజాడీలక్స్ తదితర ప్రాంతాల్లో 11 నుంచి 1.30 గంటల వరకు, దయారామార్కెట్ పరిధిలోని రిసాల, సాగర్‌లాల్ ఆస్పత్రి ప్రాంతాల్లో 2.30 నుంచి 5 గంటల వరకు, శాస్త్రినగర్ పరిధిలోని మోహన్‌నగర్, రామ్‌నగర్ తదితర ప్రాంతాల్లో 3 నుంచి 5 గంటల వరకు, దత్తానగర్ పరిధిలోని ఆక్స్‌ఫర్డ్ స్కూల్, తాజ్‌మహల్ హోటల్ తదితర ప్రాంతాల్లో ఉదయం 10 నుంచి 1 గంట వరకు, మెహిఫిల్ హోటల్ పరిధిలోని పలు ప్రాంతాల్లో 2 నుంచి 5 వరకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

వడ్డెరుల స్థితిగతులపై బీసీ కమిషన్‌కు వివరణ


వడ్డెరుల స్థితిగతులను బీసీ కమిషన్ చైర్మన్ నిరంజన్‌కు వివరిస్తున్న సత్యనారాయణ

చిక్కడపల్లి, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): వడ్డెర కులస్థుల స్థితిగతులు, అన్ని రంగాల్లో వారి వెనుకబాటుతనం గురించి ఆ సామాజిక వర్గానికి చెందిన ప్రముఖులు కమిషన్ చైర్మన్ గోపిశెట్టి నిరంజన్‌కు సోమవారం వివరించారు. వడ్డెర ఆత్మగౌరవ భవన సముదాయ ట్రస్ట్ చైర్మన్ జెరిపేటి సత్యనారాయణ, వైస్‌చైర్మన్ ఎత్తరి అంతయ్య, డైరెక్టర్‌లు డా.ఓర్సు కృష్ణయ్య, శివరాత్రి అంజయ్య, రాములు, నాగరాజు, శ్రీను తదితరులు ఈ సందర్భంగా మాట్లాడుతూ వడ్డెర కులస్థులు విద్యాపరంగా, రాజకీయంగా, ఆర్థికంగా చాలా వెనుకబడి ఉన్నారని బీసీ కమిషన్‌కు వివరించారు.

ప్రజాస్వామ్య బలోపేతానికి రాజ్యాంగం దోహదం


మాట్లాడుతున్న ఉపాధ్యాయ

బర్కత్‌పుర, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): ప్రజాస్వామ్య బలోపేతానికి భారత రాజ్యాంగం ఎంతో దోహద పడుతోందని సుప్రీంకోర్టు న్యాయవాది డాక్టర్ హెచ్.సి.ఉపాధ్యాయ అన్నారు. రాజ్యాంగం ప్రతి ఇంట్లో ఉండాలని, విద్యార్థులు, యువత పూర్తిగా అవగాహన పెంపొందించుకోవాలని సూచించారు. సోమవారం దక్షిణ భారత అడ్వకేట్ జేఏసీ ఆధ్వర్యంలో రాజ్యాంగ అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ.. రాజ్యాంగం ప్రజలు జీవించే హక్కు, భావప్రకటన స్వేచ్ఛను కల్పించిందన్నారు. జేఏసీ అధ్యక్షుడు, హైకోర్టు న్యాయవాది సుధానాగేందర్ మాట్లాడుతూ ఇంటింటికి రాజ్యాంగం అనే నినాదంతో చైతన్యశిక్షణా శిబిరాలు నిర్వహిస్తున్నామన్నారు. కార్యక్రమంలో న్యాయవాదులు సతీష్, రాంచంద్రారెడ్డి, సుదర్శన్, భూపాల్‌రాజు, రాంకిషోర్, ప్రవల్లిక, మూర్తి, బాలేశం తదితరులు పాల్గొన్నారు.



నూతనంగా నియమితులైన వారితో బజరంగ్ సేన రాష్ట్ర అధ్యక్షుడు లక్ష్మణ్‌రావు


బజరంగ్ సేన నూతన కార్యవర్గం నియామకం

బర్కత్‌పుర, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): బజరంగ్ సేన నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు ఆ సంస్థ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.ఆర్.లక్ష్మణ్‌రావు తెలిపారు. కాచిగూడలోని సంస్థ కార్యాలయంలో సోమవారం కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా శివకుమార్, ఉపాధ్యక్షుడిగా కె.రాఘవకుమార్, కార్యనిర్వాహక కార్యదర్శిగా ప్రియాచారి, మెదక్ జిల్లా అధ్యక్షుడుగా గోవింద్ ఇండోరియా, గ్రేటర్ ఉపాధ్యక్షుడుగా భరత్‌రామ్‌లను నియమించినట్లు తెలిపారు. బజరంగ్ సేన బలోపేతం చేయడానికి పలు కార్యక్రమాలు చేపడుతున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సేన ఉపాధ్యక్షుడు శ్రీనివాస్‌గుప్తా తదితరులు పాల్గొన్నారు.


చాత్తాద శ్రీవైష్ణవ కార్యవర్గ సభ్యులు

చాత్తాద శ్రీవైష్ణవుల సంక్షేమం కోసం కృషి

నల్లకుంట, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): చాత్తాద శ్రీవైష్ణవుల అభ్యున్నతి కోసం చాత్తాద శ్రీవైష్ణవ సంఘం నిరంతరం కృషి చేస్తోందని సంఘం రాష్ట్ర అధ్యక్షుడు అశ్వాపురం వేణుమాధవ్ అన్నారు. నల్లకుంటలోని నర్మదా భవన్‌లో చాత్తాద శ్రీవైష్ణవ సంఘం తెలంగాణ రాష్ట్ర సర్వసభ్య సమావేశం సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా త్వరలో చాత్తాద భవన నిర్మాణ పనులు సంఘం నిధులతో ప్రారంభించాలని, సంఘం పాలక మండలి పదవీకాలం ఐదేళ్లకు పొడగించాలని, ఒక సభ్యుడు ఏ పదవికైనా ఎన్నిమార్లు అయిన పోటీ చేయొచ్చని ఈ సమావేశంలో తీర్మానించారు. ఈ తీర్మానాలను సమావేశం ఏకగ్రీవంగా ఆమోదించింది. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా ఎస్‌ఆర్‌సీఎఫ్ ట్రస్ట్ చైర్మన్ మాధవరం వెంకటేశ్వర్లు, సినీనిర్మాత సాయివెంకట్, సంఘం ప్రధాన కార్యదర్శి వెంకటయోగి వెంకటేశ్వర్లు, ఉపాధ్యక్షులు తులసి సత్యనారాయణ, పూర్వ అధ్యక్షురాలు పద్మావతి, సభ్యులు ధర్మపురి శ్రీనివాస్, బిక్కుమల్ల నిర్మల, సంతోషాచార్యులు, పరంకుశం నీలా వెంకటరమణ, డాక్టర్ మన్మోహన్, తిరునగిరి రవికుమార్ పాల్గొన్నారు.


భోలక్‌పూర్ భవాని శంకర దేవాలయంలో దీపాలను వెలిగిస్తున్న భక్తులు

కార్తీక చివరి సోమవారం కిక్కిరిసిన శివాలయాలు

ముషీరాబాద్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): కార్తీకమాసం చివరి సోమవారం కావడంతో ముషీరాబాద్‌లోని శైవక్షేత్రాలు తెల్లవారుజాము నుంచే భక్తులతో కిటకిటలాడాయి. భోలక్‌పూర్, దేవుని తోటలోని 400 సంవత్సరాల చరిత్రగల భవాని శంకర దేవాలయంలో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించి దీపాలు వెలిగించారు. స్వామివారికి పుష్పార్చణ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో దేవాదాయ శాఖ ఈవో జ్యోతి, ఆలయ మాజీ చైర్మన్ ఆర్ శ్రీనివాస్ పాల్గొన్నారు. ప్రధాన అర్చకులు వై.చంద్రమౌళి, దేవాదాయ శాఖ ఈవో మహేందర్‌కుమార్‌లు పాల్గొన్నారు.

● సన్మానం



టీటీడీ బోర్డు సభ్యులుగా నియమితులైన నన్నూరి నర్సిరెడ్డికి సోమవారం రెడ్డి సంఘం సభ్యులు నందికొండ శ్రీనివాస్‌రెడ్డి, ఎస్.హరినాథ్ రెడ్డి, భూదాన్ సాగర్‌రెడ్డి, మధుసూదన్‌రెడ్డి, దేవిరెడ్డి విజితారెడ్డి సన్మానించారు. - నల్లకుంట

వాతావరణ మార్పులతో ఫీవర్ ఆస్పత్రికి రోగుల తాకిడి

- వైరల్ ఫీవర్, గొంతునొప్పి, దగ్గు, జలుబుతో ఇబ్బందులు
- చలికాలంలో జాగ్రత్తగా ఉండాలని వైద్యుల సూచన

బర్కత్‌పుర, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): వాతావరణంలో వచ్చిన మార్పులు, చలి తీవ్రత పెరగడంతో ప్రజలు జ్వరాల బారినపడుతున్నారు. ఉష్ణోగ్రతలు తగ్గిపోవడంతో వైరల్ ఫీవర్ బాధితుల సంఖ్య రోజురోజుకూ పెరుగుతోంది. రాత్రి, ఉదయం వేళల్లో చలి తీవ్రంగా ఉండడంతో ప్రజలు వైరల్ ఫీవర్‌తో పాటు దగ్గు, జలుబు బారిన పడుతున్నారు. నల్లకుంటలోని ఫీవర్ ఆస్పత్రి జ్వరపీడితులతో కిటకిటలాడుతోంది. ఫీవర్ ఆస్పత్రిలో సోమవారం 568 మంది ఓపీ రిజిస్ట్రేషన్ కాగా వారిలో అత్యధిక శాతం వైరల్ ఫీవర్ బాధితులే ఉన్నారు. తీవ్ర జ్వరంతో బాధపడుతున్న 12 మంది ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. ఈ ఆస్పత్రిలో ప్రస్తుతం వంద మంది రోగులు ఇన్‌పేషంట్లుగా చికిత్స పొందుతున్నారు. డెంగ్యూ కేసులు కూడా నమోదవుతున్నాయి. శనివారం మూడు, సోమవారం మరో మూడు డెంగ్యూ కేసులు నమోదయ్యాయి. చలి తీవ్రత వల్ల వృద్ధులు, చిన్నారులు తగు జాగ్రత్తలు తీసుకోవాలని వైద్యులు సూచిస్తున్నారు. కాచి వడబోసిన నీటిని తాగాలని, బయట ఆహార పదార్థాలు తీసుకోవద్దని సూచిస్తున్నారు. డిసెంబర్ నెలలో చలి తీవ్రత మరింత పెరిగే ప్రమాదం ఉందని, గుండె జబ్బులు, ఇతర వ్యాధులతో బాధపడుతున్న వారు జాగ్రత్తగా ఉండాలని పేర్కొంటున్నారు.


ఫీవర్ ఆస్పత్రిలో రోగుల రద్దీ

వృద్ధులు, చిన్నారులు జాగ్రత్తలు పాటించాలి

వృద్ధులు, చిన్నారులు తగు జాగ్రత్తలు తీసుకోకుంటే అనారోగ్య సమస్యలు తలెత్తుతాయి. చలికాలంలో వృద్ధులు, గుండె జబ్బులతో బాధపడే వారు వాకింగ్‌కు వెళితే తప్పనిసరిగ్గా మాస్క్ ధరించాలి. చలికాలం లో అందరూ జాగ్రత్తలు పాటించాలి. జ్వరం, దగ్గు సమస్యలు ఉన్నవారు వెచ్చని వాతావరణంలో ఉండాలి. అవసరమైతేనే బయటకు వెళ్లాలి. శీతల పానియాలు, ఐస్‌క్రీమ్‌లకు దూరంగా ఉండాలి. బయటకు వెళ్లినప్పుడు చెవిలో దూది తప్పనిసరిగ్గా పెట్టుకోవాలి.

- డాక్టర్ రాజేంద్రప్రసాద్, ఫీవర్ ఆస్పత్రి ఇన్‌చార్జి సూపరింటెండెంట్

పెండింగ్‌లో ఉన్న రోడ్లను పూర్తి చేయాలి

ముషీరాబాద్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): నిధులు మంజూరైనా పనులు చేపట్టకుండా నిర్లక్ష్యం చేస్తున్న కాంట్రాక్టర్లపై అధికారులు చర్యలు తీసుకొని వెంటనే పనులు పూర్తి అయ్యేలా కృషి చేయాలని ముషీరాబాద్ కార్పొరేటర్ సుప్రియా నవీన్‌గౌడ్ కోరారు. సోమవారం ముషీరాబాద్ డివిజన్‌లోని బాపూజీనగర్ శివాలయం వీధిలో రూ.14 లక్షలతో సీసీ రోడ్డు నిర్మాణ పనులను ఆమె ప్రారంభించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. నిధులు మంజూరై పనులు చేపట్టకపోవడం వల్ల షేర్‌అలీ విధి ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. అధికారులు వెంటనే పనులు పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో బీజేపీ నియోజకవర్గం జాయింట్ కన్వీనర్ ఎం.నవీన్‌గౌడ్, ఓబీసీ మోర్చా రాష్ట్ర కార్యవర్గసభ్యుడు సత్యనారాయణ, నాయకులు వెంకటేష్, బాలు, అపర్ణ, అనిత, స్నేహలత, కృష్ణయాదవ్, రాము పాల్గొన్నారు.

దివ్యాంగులకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలి


మాట్లాడుతున్న డెవలప్‌మెంట్ సొసైటీ ఫర్ డెఫ్ అసోసియేషన్

రాంనగర్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): దివ్యాంగులకు కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని డెవలప్‌మెంట్ సొసైటీ ఫర్ డెఫ్ అసోసియేషన్ జాతీయ అధ్యక్షుడు వల్లభనేని ప్రసాద్ డిమాండ్ చేశారు. సోమవారం బాగ్‌లింగంపల్లిలోని సంఘం కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. చేయూత పథకం ద్వారా దివ్యాంగుల పెన్షన్‌ను 4016 నుంచి 6 వేలకు పెంచాలని, దివ్యాంగుల ఉద్యోగ ఖాళీలను వెంటనే పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. దివ్యాంగుల కమిషనర్, డైరెక్టర్ పోస్టులలో దివ్యాంగులనే నియమించాలన్నారు. మలక్‌పేట దివ్యాంగుల భవనం ఆవరణలో బధిరుల ప్రభుత్వ కాలేజీ, డిగ్రీ కాలేజీలు, హాస్టల్ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. తమ డిమాండ్లను పరిష్కరించకపోతే ఈనెల 30న ఇందిరా పార్కు వద్ద దివ్యాంగుల మహాధర్నా చేపడతామని ఆయన హెచ్చరించారు. కార్యక్రమంలో ఉపాధ్యక్షుడు కె.వెంకటేష్ గౌడ్, కార్యదర్శి వి. భారతి తదితరులు పాల్గొన్నారు.



వృద్ధులు, అనాథలకు దుప్పట్ల పంపిణీ

స్వామి వివేకానంద యువసేన అధ్యక్షుడు దేవరుప్పుల శ్రీకాంత్ ఆధ్వర్యంలో అంబర్‌పేటలో ఫుట్‌పాత్‌లపై పడుకున్న వృద్ధులు, అనాథలను చలి నుంచి కాపాడడానికి దుప్పట్లను సోమవారం పంపిణీ చేశారు.

- అంబర్‌పేట, ఆంధ్రజ్యోతి

లారీని ఓవర్‌టేక్ చేయబోతుండగా ప్రమాదం

ద్విచక్రవాహనంపై వెళ్తున్న యువకుడి మృతి, ముగ్గురికి గాయాలు


మృతి చెందిన ప్రశాంత్

కవాడిగూడ, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): ముందు వెళ్తున్న లారీని ఓవర్‌టేక్ చేస్తుండగా ద్విక్రవాహనం అదుపుతప్పి కింద పడిపోయింది. ఈ ప్రమాదంలో ముగ్గురికి తీవ్రగాయాలయ్యాయి. వీరిలో ఒకరికి తీవ్రంగా గాయపడి చికిత్స పొందుతూ గాంధీ ఆసుపత్రిలో మృతి చెందాడు. ఈ ఘటన గాంధీనగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని సింగాడికుంటలోని ఎస్‌వీ వైన్స్ సమీపంలో సోమవారం తెల్లవారుజామున రెండు గంటల ప్రాంతంలో చోటుచేసుకుంది. గాంధీనగర్ సీఐ రాజు తెలిపిన వివరాల ప్రకారం.. దమ్మాయి గూడకు చెందిన శివ, రాజు, ప్రశాంత్(19)లు హోండా హాక్టివా (టీఎస్ 08 జేయూ 4316) ద్విచక్రవాహనంపై ముగ్గురు సోమవారం తెల్లవారుజామున లోయర్ ట్యాంక్‌బండ్ నుంచి వెళుతుండగా సింగాడికుంట ఎస్‌వీ వైన్స్ వద్దకు రాగానే ముందు వెళ్తున్న లారీని ఓవర్ టేక్ చేస్తుండగా లారీ టైరు తగలడంతో వారు అదుపుతప్పి కిందపడిపోయారు. ఈ ఘటనలో ప్రశాంత్ అనే యువకుడి తలకు తీవ్ర గాయాలయ్యాయి. శివ, రాజులకు స్వల్పంగాగాయపడ్డాడు. వెంటనే సమాచారం అందుకున్న గాంధీనగర్ పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని గాయపడిన వారిని చికిత్స కోసం గాంధీ ఆసుపత్రికి తరలించారు. తలకు గాయాలైన ప్రశాంత్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందగా, మిగతా ఇద్దరు గాంధీలో చికిత్స పొందుతున్నట్లు పోలీసులు తెలిపారు. మృతుడి కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి ప్రశాంత్ మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించి సాయంత్రం వారి కుటుంబ సభ్యులకు అప్పగించినట్లు పోలీసులు తెలిపారు. ఈ కేసును గాంధీనగర్ పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

ఓయూ గేట్లు రాత్రి తొమ్మిది వరకు ఓపెన్

హైదరాబాద్ సిటీ, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): ఉస్మానియా యూనివర్సిటీ ప్రధాన గేట్లను రాత్రి 9 గంటల వరకు తెరిచి ఉంచాల్సిందిగా వైస్ చాన్స్‌లర్ ప్రొఫెసర్ ఎం.కుమార్ భద్రతా సిబ్బందిని ఆదేశించారు. అధ్యాపకులు, ఉద్యోగులు, విద్యార్థుల అభ్యర్థన మేరకు ఈ నిర్ణయం తీసుకున్నట్లు వీసీ కార్యాలయం సోమవారం ఒక ప్రకటనలో తెలిపింది. ఉస్మానియా వర్సిటీ ప్రధాన గేట్లు (ఎన్‌సీసీ వైపు, పోలీస్‌స్టేషన్ వైపు) రాత్రి 8 గంటలకు మూసివేస్తుండగా... తాజా నిర్ణయంతో మరో గంట అదనంగా వాహనాల రాకపోకలకు అవకాశం కల్పించారు. రామంతాపూర్ వైపుగా ఉన్న రవీంద్రనగర్ కాలినడక ద్వారం నుంచి కూడా రాకపోకలకు ఉదయం, సాయంత్రం కొంత వెసులుబాటు కల్పించారు. ఓయూలో పలు నిర్మాణాలు జరుగుతుండడంతో అక్కడే నివాసముంటున్న కూలీల పిల్లలు పాఠశాలకు వెళ్లేందుకు వీలుగా పాఠశాల సమయానికి అనుగుణంగా ఈ నిర్ణయం తీసుకున్నారు.

ఆధ్యాత్మికతతో పాటు ఆనందాన్నిచ్చే భారతీయ నృత్యాలు

రాంనగర్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): భారతీయ నృత్యాలు ఆధ్యాత్మికతను ఆనందాన్ని కల్పిస్తాయని ప్రసిద్ధ నృత్యగురువు నిర్మల ప్రభాకర్ పేర్కొన్నారు. సోమవారం నల్లకుంట మెయిన్ రోడ్డులోని శృంగేరీ శంకరమఠంలో ఆకాంక్ష చారిటబుల్ ట్రస్ట్, రాఘవేంద్ర కూచిపూడి నాట్య సంగీత కళానికేతన్, శృంగేరీ శంకరమఠం సంయుక్త ఆధ్వర్యంలో కూచిపూడి నృత్య ప్రదర్శన జరిగింది. నాట్యగురువు కె.సాయిశ్రావ్య శిష్యురాళ్లు ప్రదర్శించిన ఈ కార్యక్రమానికి ప్రసిద్ధ నృత్యగురువు నిర్మల ప్రభాకర్ ముఖ్యఅతిథిగా హాజరై కళాకారులను సత్కరించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ అవకాశం, అభిరుచి కల్పిస్తే ప్రతి ఒక్కరు తమ తమ కళల్లో రాణిస్తారన్నారు. కార్యక్రమానికి కీర్తి పురస్కార గ్రహీత రఘుశ్రీ అధ్యక్షత వహించగా ఆకాంక్ష చారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపకురాలు పాలపర్తి సంధ్యారాణి, కళారంగ ప్రముఖులు మద్దాళి రఘురామ్, లక్కరాజు నిర్మల, కొండపల్లి నర్సింహారావు, కె.సాయిశ్రావ్య, లాస్య, ఈష, గౌరీ తదితరులు పాల్గొన్నారు.



డిప్యూటీ కమిషనర్ మహ్మద్ ఖాదర్ మొహినుద్దీన్‌కు వినతిపత్రం సమర్పిస్తున్న వాజీద్ హుస్సేన్, సయ్యద్ జూహేర్ హుస్సేన్

రిసాల మసీదు వరకు రోడ్డు కోసం వినతి

రాంనగర్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): రాంనగర్ డివిజన్‌లోని గోల్కొండ చౌరస్తా మెయిన్ రోడ్డు నుంచి ఎంబి. బేతెల్ చర్చి, రిసాలలోని మసీదు ఈ క్యూబ్ వరకు నూతన రోడ్డును ఏర్పాటు చేయాలని కోరుతూ సోమవారం జీహెచ్‌ఎంసీ కార్యాలయంలో జరిగిన ప్రజావాణిలో ముషీరాబాద్ డిప్యూటీ కమిషనర్ మహ్మద్ ఖాదర్ మొహినుద్దీన్‌కు మాజీ కార్పొరేటర్ వాజీద్ హుస్సేన్, డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు సయ్యద్ జూహేర్ హుస్సేన్ తదితరులు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ మార్గం ప్రస్తుత బీటీ రోడ్డు గుంతలు పడి వాహనదారులు, పాదచారులకు తీవ్ర ఇబ్బంది కలుగుతుందని డీఎంసీకి తెలిపారు. నూతన రోడ్డు నిర్మాణం చేపట్టి ప్రజల సమస్యలను తొలగించాలని కోరారు. ఇందుకు సంబంధించిన నిధులు మంజూరు చేసి రోడ్డు పనులు ప్రారంభించాలని కోరారు.

చేపల వేటకు వెళ్లిన వ్యక్తి మృతి


ఇమ్రాన్

శంషాబాద్ రూరల్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): చేపల వేటకు వెళ్లి కాముని చెరువులో పడి వ్యక్తి మృతి చెందాడు. ఈ సంఘటన ఆర్జీఐఏ పోలీస్ స్టేషన్ పరిధిలో సోమవారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. నగరంలోని ముషీరాబాద్‌కు చెందిన సయ్యద్ ఇమ్రాన్(29) ఆదివారం చేపల వేటకు శంషాబాద్ మున్సిపల్‌లో ఉన్న కాముని చెరువుకు వెళ్లాడు. ప్రమాదవశాత్తు నీటిలో పడిపోయాడు. గమనించిన స్థానికులు అతడిని ఒడ్డుకు తీసుకొచ్చారు. అప్పటికే అతడు స్పృహ కోల్పోయ్యాడు. 108లో నగరంలోని ఉస్మానియా ఆస్పత్రికి తరలించగా సోమవారం ఉదయం మృతి చెందాడు. మృతుడికి భార్య, పిల్లలు ఉన్నట్లు పోలీసులు తెలిపారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

పాఠశాలల్లో సదుపాయాలను మెరుగుపరచాలి



మాట్లాడుతున్న కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి

హైదరాబాద్ సిటీ, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్ జిల్లాలోని ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ రెసిడెన్షియల్ పాఠశాలలు, కళాశాలల్లో సదుపాయాలను మెరుగుపరచాలని కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి అధికారులను ఆదేశించారు. హాస్టళ్లలో శానిటేషన్, కిచెన్, స్టోర్‌రూమ్‌ల నిర్వహణ బాగుండాలని, లేదంటే వార్డెన్లు, ప్రిన్సిపాళ్లపై కఠిన చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు. సోమవారం కలెక్టరేట్‌లోని తన చాంబర్‌లో వసతి గృహాల నిర్వహణపై వార్డెన్లు, ప్రత్యేక అధికారులతో కలెక్టర్ టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రెసిడెన్షియల్ పాఠశాలల్లో కిచెన్, స్టోర్‌రూమ్, భోజనశాల, వంటగది నిర్వహణ పనితీరుపై వందమార్కులు కేటాయించామని, 75 శాతం కంటే తక్కువ వచ్చిన వార్డెన్లు, ప్రిన్సిపాళ్లకు షోకాజ్ నోటీసులు జారీ చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. పనితీరు మెరుగుపరుచుకోని అధికారులను విధుల నుంచి సస్పెండ్ చేస్తామని ఆయన హెచ్చరించారు. ప్రత్యేక అధికారులు ప్రతి వారం తమకు కేటాయించిన హాస్టళ్లను తనిఖీ చేసి నివేదిక అందించాలని కలెక్టర్ సూచించారు.

పార్లమెంట్‌లో బీసీ బిల్లు ప్రవేశపెట్టాలి


మాట్లాడుతున్న బురుగుపల్లి కృష్ణయాదవ్

రాంనగర్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): శీతాకాల పార్లమెంట్ సమావేశంలో బీసీ బిల్లు ప్రవేశపెట్టి ఆమోదింపజేయాలని బీసీ జాగృతి సేన ఉమ్మడి తెలుగు రాష్ట్రాల అధ్యక్షుడు బురుగుపల్లి కృష్ణయాదవ్ కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం విద్యానగర్‌లోని బీసీ భవన్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. 2018లో పార్లమెంట్ సాక్షిగా ప్రధాని మోదీ ఇచ్చిన హామీ ప్రకారం బీసీ గణన చేపట్టి జనాభా ప్రాతిపదికన అన్ని కులాలకు రాజ్యాంగ పరంగా రావాల్సిన వాటాను కల్పించాలన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లను అమలు చేయాలని, ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్లను రద్దు చేయాలని లేనిపక్షంలో పెద్దఎత్తున ఉద్యమం చేపడతామన్నారు. ఈ కార్యక్రమంలో బీసీ ఫ్రంట్ రాష్ట్ర అధ్యక్షుడు గొరిగే మల్లేష్‌యాదవ్, నాయకులు నికిత్, రాములు తదితరులు పాల్గొన్నారు.



చెట్టు కొమ్మలు విద్యుత్ తీగలకు తగులుతుండడంతో జీహెచ్‌ఎంసీ సిబ్బంది ఆ కొమ్మలను నరికివేసి రోడ్డుపై వేసి వదిలేసింది. దీంతో పాదచారులు, వాహనాల రాకపోకలకు ఇబ్బందికరంగా మారింది. అంబర్‌పేట సీపీఎల్ రోడ్‌లోని తిరుమల హోటల్ లేన్‌లో చెట్టు కొమ్మలు కట్‌చేసి అక్కడే వదిలేశారు. వారం రోజులు కావస్తున్నా కొమ్మలను తరలించలేదు. వెంటనే కొమ్మలను తరలించాలని స్థానికులు కోరుతున్నారు.

- గోల్నాక, నవంబర్ 25 ఆంధ్రజ్యోతి

బావార్చి బిర్యానీలో సిగరెట్ పీక

రాంనగర్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): బావర్చి బిర్యానీలో సిగరెట్ పీక రావడం కలకలం రేపింది. సోమవారం జరిగిన ఈ సంఘటన సోషల్ మీడియాలో వైరల్ కావడంతో బావార్చికి బిర్యాని తినవడానికి వచ్చినవారు బెంబేలెత్తిపోయారు. అస్టోరియాలో బిర్యాని తింటే ఎలుక ఫ్రై ఫ్రీ, బావార్చి బిర్యానీలో బొద్దింక, ఎలుక, బల్లి వంటి వార్తలతో ఇప్పటికే బెంబేలెత్తుతున్న కస్టమర్లు బావార్చిలో సిగరెట్ పీక రావడాన్ని సోషల్‌మీడియాలో చూసి జీర్ణించుకోలేకపోయారు. దీనికి సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. సోమవారం సాయంత్రం కొంతమంది కస్టమర్లు బావార్చి సెంటర్‌కు వచ్చి బిర్యాని ఆర్డర్ ఇచ్చారు. ఈ క్రమంలో బిర్యానీలో సిగరెట్ ముక్క రావడంతో వారు తీవ్ర ఆగ్రహానికి గురయ్యారు. ఇంత అపరిశుభ్రం ఏమిటని హోటల్ సిబ్బందిపై మండిపడ్డారు. గతంలోనూ బిర్యానీలో బల్లి వచ్చిందని ఇకనైనా అధికారులు చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు. హోటల్‌వారు ఇచ్చే తాయిలాలకు లొంగిపోకుండా కస్టమర్ల ఆరోగ్యం పట్ల అధికారులు దృష్టి సారించాలని వారు డిమాండ్ చేశారు.

సేవారత్న అవార్డుల ప్రదానం

బర్కత్‌పుర: భారత రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా పలువురికి సేవారత్న అవార్డులు ప్రదానం చేస్తున్నట్లు తెలంగాణ మేధావుల ఫోరం రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ రాజ్‌నారాయణ ముదిరాజ్ తెలిపారు. హైకోర్టు న్యాయవాదులు స్వదేశ్ అయోధ్య సాయిచక్రవర్తి, శత్రునాయక్, జి.ఎట్టయ్య, డి.రాజిరెడ్డి, ఆమూల్య, ముస్తాఫ అహ్మద్ అమీర్‌లకు జూరిస్ట్ అవార్డులను ప్రదానం చేస్తున్నట్లు తెలిపారు.

రైలు ప్రయాణికురాలి సెల్‌ఫోన్, నగదు చోరీ

బర్కత్‌పుర, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): రైలు ప్రయాణికురాలి సెల్‌ఫోన్, నగదును దొంగలు తస్కరించారు. కాచిగూడ రైల్వే సీఐ ఎల్లప్ప తెలిపిన వివరాల ప్రకారం. నగరంలోని హరిపురి కాలనీకి చెందిన నాగరాణి(79) మదురై - కాచిగూడ స్పెషల్ రైలులో నగరానికి వస్తుంది. అనంతపురం వద్ద బ్యాగులో ఉన్న సెల్‌ఫోన్, 10 వేల నగదు, ఎస్‌బీఐ ఏటీఎం కార్డు కనిపించలేదు. దీంతో ఆందోళన చెందిన నాగరాణి సోమవారం కాచిగూడ రైల్వే పీఎస్‌లో ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసుకుని తదుపరి విచారణ నిమిత్తం అనంతపురం రైల్వే పీఎస్‌కు బదిలీ చేశారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

బర్కత్‌పుర, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందాడు. కాచిగూడ అడ్మిన ఎస్‌ఐ సుభాష్ తెలిపిన వివరాల ప్రకారం. బర్కత్‌పుర క్రౌన్‌కేఫ్ వద్ద 70 ఏళ్ల వయసు గల గుర్తు తెలియని వృద్ధుడు ఈ నెల 23న ఫుట్‌పాత్‌పై పడి ఉండగా స్థానికుల సమాచారం మేరకు అతడిని ఆస్పత్రిలో చేర్పించారు. పరిస్థితి విషమించి చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందినట్లు ఎస్‌ఐ తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

యువత స్వయం ఉపాధి పథకాలను సద్వినియోగం చేసుకోవాలి

చిక్కడపల్లి, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): యువత స్వయం ఉపాధి పథకాలు సద్వినియోగం చేసుకుని వృద్ధిలోకి రావాలని బీజేపీ సికింద్రాబాద్ పార్లమెంటు నియోజకవర్గం జాయింట్ కన్వీనర్ ఎ.వినయ్‌కుమార్ అన్నారు. గాంధీనగర్ డివిజన్ జవహర్‌నగర్ ఎస్‌ఆర్‌టీ క్వార్టర్స్‌లో వేదాస్ ఫ్లేవర్ హబ్ పేరుతో ఏర్పాటు చేసిన నూతన అల్పాహార, భోజనశాలను వినయ్‌కుమార్ సోమవారం ప్రారంభించారు. కార్యక్రమంలో బీజేపీ నేతలు శ్రీకాంత్, రత్నసాయిచంద్, ప్రవీణ్, హరి, వరుణ్, అజయ్, నర్సింగ్‌రావు, సత్తిరెడ్డి, ప్రకాష్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

మతవిద్వేషాల నుంచి నగరాన్ని కాపాడుకోవాలి


సమావేశంలో మాట్లాడుతున్న మజార్ హుస్సేన్

రాంనగర్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): మతోన్మాద, విద్వేష శక్తుల నుంచి హైదరాబాద్ నగరాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపైనా ఉందని వామపక్ష పార్టీల సమావేశంలో పలువురు వక్తలు పేర్కొన్నారు. సోమవారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో సీపీఎం నగర కమిటీ కార్యదర్శి ఎం.శ్రీనివాస్ అధ్యక్షతన 'మతోన్మాద - విద్వేష శక్తుల నుంచి నగరాన్ని కాపాడుకుందాం' అనే అంశంపై సదస్సు నిర్వహించారు. ఈ సదస్సులో కోవా డైరెక్టర్ మజార్ హుస్సేన్, పూలే - అంబేద్కర్ ఇనిస్టిట్యూట్ డైరెక్టర్ బి.సుదర్శన్, సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు ఇ.టి.నర్సింహ, సీపీఐ ఎంఎల్ (మాస్‌లైన్) నగర కార్యదర్శి హన్మేష్, ఝాన్సీ, శివబాబు, ఎస్‌యూసీఐ నాయకులు జానీబాషలు హాజరై మాట్లాడారు. నగరంలో బీజేపీ, ఆర్‌ఎస్‌ఎస్, వీహెచ్‌పీ వంటి సంస్థలు మతవిద్వేషాలను రెచ్చగొడుతూ రాష్ట్రంలో అల్లర్లు సృష్టించే ప్రయత్నం చేస్తున్నాయని ఆరోపించారు. ఆలయాలపై జరిగిన దుర్ఘటనలను మతపూరితం చేసి రాజకీయ పబ్బం గడుపుకునేందుకు బీజేపీ ప్రయత్నిస్తోందని ఆరోపించారు. నిరుద్యోగం, పెరుగుతున్న ధరలు, పేదరికం, దేశంలో పెరుగుతున్న అవినీతి, తదితర సమస్యలను పక్కదోవ పట్టించేందుకు బీజేపీ ప్రయత్నిస్తోందని విమర్శించారు. ఎంఐఎం, బీజేపీలు పవిత్రమైన పండగలను బలప్రదర్శన కోసం రాజకీయాలను వాడుకుంటున్నాయన్నారు. మత ప్రదర్శనలో డీజేలకు అనుమతిపై నిషేధం విధించడం అభినందనీయమన్నారు.